క్లుప్తంగా

ఎన్నికల ఏర్పాట్లపై పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

పిచ్చాటూరు: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్థానిక అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం పిచ్చాటూరు తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన కలెక్టర్ మండలంలో పోలింగ్ కేంద్రాల వివరాలు, అందులో ఏర్పాట్ల గురించి ఈఆర్‌ఓ నరసింహులు, తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్‌ను వివరాలు కోరారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్‌ఐ సంజీవ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, డీటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం



విద్యుద్దీపాలంకరణలో ఆలయం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని శ్రీఅభయాంజనేయ సమేత కోదండరామాలయంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు దంపతులుగా పాల్గొనాలని ఆలయ చైర్మన్ సీఎస్ రెడ్డి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు భక్తి సంగీత విభావరి ఉంటుందని, అలాగే 8 గంటలకు అన్నదానం, తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించాలన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



సారెను తీసుకు వస్తున్న ఉభయదారులు

రేణిగుంట: మండలంలోని కుర్రకాల్వలో వెలసిన రాములవారి ఆలయంలో ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. కుర్రకాల్వకు చెందిన ఉభయదారులు మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లకు సారె తీసుకొచ్చారు. ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా సాగింది. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉబయదారులు మాజీ సర్పంచ్‌లు రాణెమ్మ, గురవారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్, గురవయ్య, ధనంజయులు, వేణు ముదిరాజ్ పాల్గొన్నారు.

మద్రిమందలో ..



ఏర్పేడు: మద్రిమందలోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

నేటి నుంచి శుకబ్రహ్మాశ్రమంలో ఆరాధనోత్సవాలు



సంపూర్ణనందగిరిస్వామి, ఉత్తరాధికారి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో ఉన్న శుకబ్రహ్మాశ్రమంలో ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు స్వామి విద్యాప్రకాశానందగిరి ఆరాధనోత్సవాలు ఆరాధనోత్సవాలు, 111వ జయంతి, 74వ ఆశ్రమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి, ఉత్తరాధికారి సంపూర్ణనందగిరి స్వామి తెలిపారు. ఈ ఆరాధనోత్సలకు దేశం నలుమూలల నుంచి పలువురు పీఠాధిపతులు విచ్చేసి ఉపన్యసించనున్నారని పేర్కొన్నారు.

నేడు బియ్యపు శ్రీవాణిరెడ్డి ప్రచారం

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం పంచాయతీ దేశమ్మనగర్, ఏపీఐఐసీ క్వార్టర్స్, ఐటీఐ కాలనీ, గాజులమండ్యం శివాలయం వీధిలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణి రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేనూ మీలో ఒకడిని.. ఆశీర్వదించండి

- సత్యవేడు అభివృద్ధి నా బాధ్యత
- జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్



బత్తలవల్లంలో నూకతోటి రాజేష్ ప్రచారం

వరదయ్యపాళెం: 'నేనూ మీలో ఒకడిని..ఆశీర్వదించండి..సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా'అని వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. మండలంలోని బత్తలవల్లం, మత్తేరిమిట్ట, తొండూరు పంచాయతీల్లో ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై ఎన్నిల ప్రచారం నిర్వహించారు. బత్తలవల్లంలో ఆయనకు గ్రామస్తులు, నేతలు బ్రహ్మరథం పట్టారు. అలాగే మత్తేరిమిట్టలో సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో గజమాల వేసి రాజేష్‌కు ఘన సత్కారం నిర్వహించి పురవీధుల్లో ర్యాలీగా వెళ్లి ప్రచారం నిర్వహించారు. తొండూరులో సర్పంచ్ రమణయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారం జరిగిన ప్రతి గ్రామంలో ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూలు చల్లుతూ, బాణసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. రాజేష్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుంటేనే సంక్షేమం, అభివృద్ధి పూర్తిస్థాయిలో కొనసాగుతాయని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరుసటి రోజు నుంచే నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, విలేజ్ కన్వీనర్ గిరిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు శీనురెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, రమేష్, బీసీ సెల్ కన్వీనర్ శేఖర్ యాదవ్, ఎస్సీ సెల్ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, శిబి చక్రవర్తి, సర్పంచులు రమణయ్య, సింధు, ఎంపీటీసీ కస్తూరి, మండల ప్రచార కన్వీనర్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



మత్తేరిమిట్టలో ర్యాలీగా రాజేష్ ప్రచారం



మత్తేరిమిట్టలో గజమాలతో రాజేష్‌కు సత్కారం

కమనీయం..అగస్తీశ్వరుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆదివారం రాత్రి ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామివారు అశ్వవాహనంపై పుర వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి సుందరంగా అలంకరించుకుని కల్యాణ మండపంలోకి వేంచేశారు. అర్చకులు వేదమంత్రాల మధ్య కల్యాణం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలతో పాటు వస్త్ర బహుమానాన్ని అందించారు. అనంతరం అశ్వవాహనం అధిఅరోహించి అగస్తీశ్వరుడు పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు రమేష్ గురుకళ్, గౌతం గురుకళ్ పాల్గొన్నారు. ఉత్సవాలలో సోమవారం ఉదయం నటరాజ ఉత్సవం, సాయంత్రం రావణాసుర వాహనంపై స్వామివారు విహరించనున్నారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ట



హోమ పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కుంభాభిషేకంలో భాగంగా ఆదివారం స్వా మివారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. కుంభాభిషేక ఏర్పాట్లను గోవర్ధన గిరి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు, ఆదివారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలి వచ్చారు. సుమారు 25 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్రదర్శనం టిక్కెట్లు 768, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్లు 2020 విక్రయించారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి రూ.12,332 అమ్ముడయ్యాయి. ఇక ఐదు రకాల రాహుకేతు పూజలు పెద్దసంఖ్యలో జరిగాయి, మొత్తం 3,579 పూజలు జరిగినట్లు, భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆగమోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం పెద్దకొట్టాయి ఉత్సవం ఆగమోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని అలంకార మండపంలో శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ కోటమండపం వద్దకు వేంచేపు చేసి, మూడు ప్రదక్షిణలు చేసి కొలువుదీర్చారు. విశేష నైవేద్యం, మంత్రపుష్పం, దీపారాధన, హారతులు ఇచ్చా రు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

భార్యపై హత్యాయత్నం

–చికిత్స పొందుతూ వివాహిత మృతి

వరదయ్యపాళెం: కుటుంబ కలహాలతో భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం ప్రాణం మీద కొచ్చింది. ఏకంగా కట్టుకున్న భార్యనే భర్త కడతేర్చిన ఘటన వరదయ్యపాళెం మండలంలోని సాధన వారిపాళెంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రతాప్ తెలిపిన మేరకు వివరాలు.. సాధనవారిపాళెంకు చెందిన టీ.అంజలి(23)కి రేణిగుంట సమీపంలోని తూకివాకం గ్రామానికి చెందిన టీ.రాజశేఖర్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే మొదటి సంతతికి గర్భం దాల్చిన అంజలి ప్రసవ నిమిత్తం వరదయ్యపాళెం మండలంలోని సాధన వారిపాళెంలోని పుట్టింటికి నాలుగేళ్ల క్రితం వచ్చింది. అదే సమయంలో భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. భార్యపై అనుమానం పెట్టుకున్న భర్త తరచూ గొడవ పడేవాడు. అప్పటి నుంచి పుట్టింటి వద్దే అంజలి జీవనం సాగిస్తోంది. అయితే నాలుగు నెలలుగా భర్త రాజశేఖర్ కూడా భార్య వద్దనే ఉన్నాడు. గత శుక్రవారం సాయంత్రం అంజలి ఫోన్‌లో మాట్లాడుతుండగా భర్త రాజశేఖర్ అనుమానించి గొడవ పడ్డాడు. అంజలి బాత్రూంలోని స్నానానికి వెళ్లగా భర్త రాజశేఖర్ బాత్రూంలోకి చొరబడి భార్యను గొంతు నులిమి చంపబోయాడు. తర్వాత అంజలి గొంతుకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం శ్రీకాళహస్తికి తరలించగా అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయానికి ఐక్యంగా శ్రమిద్దాం



మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

రేణిగుంట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కలసికట్టుగా పనిచేద్దామని రేణిగుంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సి.తిరుమలరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కరకంబాడి సమీపంలోని శ్రీకట్టపుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నాయకులతో ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ శ్రేణులు ఏవైనా చిన్నపాటి అసంతృప్తులు ఉంటే పక్కన పెట్టి కలసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. నాయకులు రహీం, వెంకటయ్య, కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కన్నయ్య, ఆవుల యుగంధర్, వేణుగోపాల్, లోకేష్‌యాదవ్, అమ్ములమ్మ, నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష పూజలు



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలోని శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆధ్వర్యంలో ఆలయంలోని నందీశ్వర స్వామి, వాల్మీకీశ్వరస్వామికి ఏక కాలంలో పూజలు నిర్వహించారు. చెన్నైకి చెందిన సునీల్‌కుమార్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యుడు ఆనందయ్య, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది.

మునగలపాళెంలో అమర వీరులకు నివాళి





స్తూపం వద్ద మృతుల కుటుంబ సభ్యుల నివాళులు, మృతుల ఫొటోలతో ఏర్పాటు చేసిన బ్యానర్

- టీడీపీ ఇసుక మాఫియా ధాటికి 16 మంది రైతుల మృతి
- లారీ దూసుకొచ్చిన ఘటనకు ఏడేళ్లు

ఏర్పేడు: గత ప్రభుత్వంలో టీడీపీ నాయకుల ఇసుక మాఫియాను అరికట్టేందుకు న్యాయం కోసం ఏర్పేడు పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి లారీ ప్రమాదంలో మృతి చెందిన అమర వీరుల(రైతులకు)కు మండలంలోని మునగలపాళెంలో ఆయా బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం ఘన నివాళి అర్పించారు. ఇసుకమాఫియాతో అప్పటి టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామానికి సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలో 30 నుంచి 40 అడుగుల లోతు వరకు తవ్వేసి అక్రమంగా తరలించేవారు. అక్రమ ఇసుక రవాణాతో భూగర్భ జలాలు అంతరించి పోయాయి. దీంతో 2017 ఏప్రిల్ 21న ఏర్పేడు పోలీస్ స్టేషన్ వద్దకు మునగలపాళెం, ముసలిపేడు, రావిళ్లవారికండ్రిగ గ్రామాలకు చెందిన రైతులు న్యాయం కోసం వెళ్లారు. పోలీస్ స్టేషన్ వద్ద రైతులు ఉన్న సమయంలో లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రైతులపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో 13 మంది మునగలపాళెం రైతులు, ఇద్దరు ముసలిపేడు, ఒకరు రావిళ్లవారికండ్రిగ గ్రామానికి చెందిన రైతు, ఆంధ్రజ్యోతి విలేకరి అక్కడికక్కడే మృతిచెందగా, 21 మంది మునగలపాళెం గ్రామానికి చెందిన రైతులు క్షతగాత్రులుగా మారారు. వారి జ్ఞాపకార్థం మునగలపాళెంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన అమర వీరుల స్తూపాన్ని నిర్మించారు. ఏటా ఏప్రిల్ 21న మృతుల కుటుంబ సభ్యులు ఇక్కడ పూజలు నిర్వహించి నివాళులు అర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం మృతుల కుటుంబ సభ్యులు అమర వీరుల స్తూపం వద్దకు చేరుకుని పూజలు చేసి నివాళులు అర్పించారు.

శ్రీరాముని ఆశీస్సులతో సుభిక్షం



శ్రీకాళహస్తి : ఆలయ పూజల్లో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి : శ్రీరాముని కృప ఉంటే లోకమంతా సుభిక్షంగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకన్నలిలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ ఆలయ కుంభాభిషేకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి సారె అందించేందుకు వెళ్లిన పవిత్రారెడ్డికి గ్రామంలో ఘన స్వాగతం లభించింది. అనంతరం ఆమె ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరాముడు చల్లని దేవుడని, ఆయన దయ ఉంటే సర్వప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని చెప్పారు. గ్రామంలో సీతారాముల ఆలయం నిర్మించి ఆధ్యాత్మికత విస్తరించేందుకు కృషి చేసిన వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, చైతన్యరెడ్డి, నరసింహనాయుడు, చెంచురెడ్డి, మునిచంద్రారెడ్డి, రూప్‌కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వినీత్‌రెడ్డి, పవన్‌కుమార్, సుకుమార్‌రెడ్డి, సునీల్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విజయ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏర్పేడు: మండలంలోని సదాశివపురం నూతనంగా నిర్మించిన శ్రీవిజయ గణపతి ఆలయంలో ఆదివారం కుంభాభిషేకం పూజలు వైభవంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు పవిత్రారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఆమె వెంట పార్టీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, నాయకులు శేఖర్ రాజు, కుప్పాల వెంకటేష్, నరసింహారెడ్డి, జయరాంరెడ్డి, జగదీష్, వెంకటేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఏర్పేడు: పూజల్లో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

రామాలయంలో పూజలు

ఏర్పేడు మండలంలోని బాలకృష్ణాపురం రామాలయంలో ఆదివారం రాస్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. రాస్ సంస్థ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి రామాయణాన్ని వివరించారు. రాస్ ఫీల్డ్ అధికారి వెంకట్ కుమార్, అనిమేటర్ జయంతి పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంను తనిఖీ చేసిన కలెక్టర్



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

సత్యవేడు: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంను తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని ఆయన పరిశీలించారు. పలు పార్టీల నాయకుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంకు సీల్ వేశారా అని ఆరా తీశారు. అంతకు ముందు దాసుకుప్పంలోని ఎస్‌ఎస్‌టీ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటివి రాకుండా కట్టడి చేయాలని, ప్రతిదీ వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం 278, 279 పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఓ, డీఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్ వీడియో గ్రఫీ ఉంటుందన్నారు. ఏఈఆర్‌ఓ రామాంజనేయులు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎన్నికల డీటీ రవిచంద్ర, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించింది బొజ్జల సుధీరే..





బొజ్జల సుధీర్ నామినేషన్ సమయంలో ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108 వాహనం, నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ కేంద్రం వద్ద పార్క్ చేసిన బొజ్జల సుధీర్‌రెడ్డి వాహనం

- ఎమ్మెల్యేపై ఎల్లోమీడియా విష ప్రచారం
- ఇదేనా జర్నలిజం అంటూ జనం మండిపాటు

శ్రీకాళహస్తి: నిబంధనలు ఉల్లంఘన అంటూ పచ్చ మీడియాలో ఆదివారం ప్రచురితమైన పిచ్చిరాతలపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి. నామినేషన్‌కు బియ్యపు మధుసూదన్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై వచ్చారని... నిబంధనలు ఉలంఘించారని రాశారు. నామినేషన్ సమయంలో బొజ్జల సుధీర్‌రెడ్డి ఆర్డీవో కార్యాలయం ముందు కారు నిలిపి ఆయన, ఆయన సతీమణి లోపలికి వెళ్లిన విషయం పచ్చమీడియాకు కనిపించలేదు. వంద మీటర్ల వరకు వాహనాలు వెళ్లవచ్చని నిబంధన ఉన్నప్పటికీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దానికన్నా ముందే ద్విచక్రవాహనాన్ని ఆపినా నిబంధనల ఉల్లంఘన అంటూ పచ్చమీడియాలో రాయడంపై సర్వత్రా ఏవగించుకున్నారు. అలాగే ర్యాలీ సమయంలో 108 వాహనం వస్తే అందరూ పక్కకు తప్పుకుని దారి ఇచ్చారని, అయినా 108కి అడ్డుగా వచ్చారని పచ్చమీడియాలో రాయడంపై జనం మండిపడ్డారు. ఇదేనా పాత్రికేయం అంటు దుయ్యబట్టారు. బొజ్జల సుధీర్‌రెడ్డి నామినేషన్ వేసే సమయంలో తిరుపతి నుంచి ఆస్పత్రికి వస్తున్న 108 వాహనం ముందు అనేక వాహనాలు అడ్డుపెట్టి, కదలకుండా కబుర్లు ఆడుకున్నారు. పోలీసులు వచ్చేవరకు వారు కదలేదు. ఇది పచ్చమీడియాకు కనిపించలేదు. ఇకనైనా పచ్చమీడియా పిచ్చి రాతలు మానుకోవాలని జనం హితవు పలికారు.